# కుట్టమ్మాళ్

అయిడ పేరు కుట్టమ్మాల్. కుట్టీ, కుట్టి అని పిలిసేవోరు. ఆయిడ్ని కనుక్కోడానికి ఓబాయికి మూణ్ణాళ్ళు పట్టింది.

అప్పుడు మా కంపెనీ మద్రాసులో వుంది. రాయపేట నుంచి మైలాపూర్ పోతుండా. మద్దాన్నం అయింది. నా ముందరే నడుత్తున్న దాయిడ. ఆ యనకాలేపు నుంచి ఆ పొట్టి మడిసిని సూసి పద్దాలుగేండ్లుంటా యేమో అనుకున్నా.

ఒచ్చేపోయేవార్ని విదిలించుకుంటూ పోయి పోయి అయిడ ఓ ఇంటి గేటును తీస్తోంది. మొగం సూసి అచ్చర్యపోయాను. మడిసికి పాతికేళ్ళుం టాయి. ఆ ఆశ్చర్యంతో ముందుకుపోయి యెనక్కి తిరిగేసరి కాయిడలేదు.

కంపెనీ పోయేసరికి రేసన్ లెక్కలు తప్పు చెప్పావని ఆదెర్లీ రూముకు పిలిశారు. ఆడ పోయిం తర్వాత ఈయిడ ఇసయమే మరిసి పోయా.

ఆ తర్వాత తలుసుకున్నా. అయిడె ఇగ్రహం అచ్చుకొట్టినట్లు మనసు కొచ్చింది. ఆ గుండ్రని మొగం, ఆ చిట్టి గడ్డం అన్నీ తలుసు కున్నా. ఆ వారం నా కిచ్చే చిగరెట్ల రేసనంతా తన కిస్తానంటే ఓబయగా డాయిడ వునికి యెక్కడో కనుకొత్తానని ఒప్పుకున్నాడు.

ఓబాయిగాడి తల నలుసదరంగా వుంటుంది. జుత్తు పొట్టిది. గొర్రె జుత్తల్లే బిరుసు. ఆడు మాత్రం బిరుసు మనిసి కాదు. యారితో మాటాడినా నిముసంలో ఆరి నమ్మకం తీసుకుంటాడు. ఎంత లావైన పనైనా సులాగ్గా చేసుకొత్తాడు.

మూడునాళ్ళు తిరిగేట్ట. నాలుగో రోజు వొచ్చి ఆ పిల్ల పనిసేత్తున్న యిల్లా కదా కమామీసూ పట్టుకొచ్చాడు. ఆయిడ పేరు కుట్టిమ్మాలు, పిలోడం మాత్రం 'కుట్టి' అంటారు, అని సెప్పాడు.

"ఓ పని సేయరా! ఓ సిన్న సీటిముక్క రాయి. మెల్లిగా పోయి ఆయిడ కిచ్చొత్తా" నన్నాడు ఓబాయి.

నాకు సీటీలు రాయమంటే తలనొప్పి. డూటీ గందా అని రేసను లెక్కలు మాత్రం రాత్తుంటా. సరేలే అని ఓ సీటీముక్క రాసిచ్చా.

మర్నాడు రాయిపేట ఆసుపత్రి మలుపులో దాన్ని కలుసుకున్నా.

నాకూ సిగ్గేసింది. ఆయిడకీ సిగ్గేసింది.

"చినీమా పోదాం" అన్నాను.

"ఉహూ! మా అక్కకు ఒంట్లో బాగుండ్లా, యింటి కెళ్ళాలి" అన్నది.

"నీ పేరు బలేగుంది" అన్నాను.

"నీ పేరేంది" అంది.

"నా పేరా? లచ్చన్న. చేహితులు తమాసాకు లచ్మికె లచ్చన్నని పిలుత్తారు."

"తమాసా పేరే!" అంది.

"మళ్ళీ యెప్పుడు కలుత్తా?" అన్నాను.

"రేపిదేయాల కిక్కడే కలుద్దాం" అంది.

ఆ సీకటి సందులో ముద్దెట్టుకోపోయా. ఇప్పు దొద్దంటూ పోయింది.

మర్నాడు అనుకున్న టైముకు అరగంట ముందుపోయా. ఆయిడ మాత్రం టైముకే వొచ్చింది.

"ఎక్కడికి పోదాం" అన్నాను.

"నీ యిట్టం" అంది.

"ముందేదైనా వోటలికి పోదాం పద" అన్నాను.

మిలిటరీ వోటలు పోయాం. పలావ్, కుర్మా, పరోటా లార్డరు సేశాం.

"చినీమా పోదామా" అన్నాను.

"ఊః! డబ్బెందుకు వృదా సేయడం" అంది.

"నాకు సంతోషంకొద్దీ నే కర్సు పెడుతున్నా" నన్నాను.

చినీమా కింకా ఓ గంట టైముంది. దూరంగా బెంచీలమీద కూకున్నాం.

"నీ సంగతేం తెలీదు నాకు" అంది.

"నా సంగతేం వుంది, నేను మిలిటరీసేరి నాలుగేండ్లయింది. అంతకుపూర్వం కిల్లీ కొట్టెట్టాను. ఇప్పుడు మా తమ్ముడు సూత్తున్నాడు దాన్ని" అన్నాను.

ఆనాడు కూడా ముద్దెట్టుకోపోతే వొద్దంది, నా కర్మంకాలా.

ఆళ్ళింటిదాకా పోయి పంపించా.

ఆళ్ళిల్లు మైలాపూరుకూ రాయపేటకూ మద్దె కొబ్బరిసెట్లల్లో వుంది. ఆయిడ్నిడి సెట్టడం ఆయిడక్క సూసింది. ఏమన్లేదు.

మళ్ళీ మర్నాడు మామూలుగా కలుసుకున్నాం. బీచికి పోయాం. ఇసకమీద కూకున్నాం.

"మా అక్క నిన్ను సూసింది. నువ్వెళ్ళిం తర్వోత నన్ను సాలా అడిగింది."

"ఏమనడిగిందేం?"

"ఆః నీ కెట్లా తెలుసు! ఆయనకి పెండ్లంయిందనుకో, నిన్నేం చేత్తాడు. మడుసుల యవారాలు తెలీకుండా చేహం చేయకూడదు అంటూ యేందేందో ఆడింది!"

"నువ్వేమన్నా?"

"ఆ! ఆయన సాలా పెద్దమడిసి, పెండ్లి కానోడు, నన్ను పెండ్లి సేసుకుంటాడులే. సొంతిల్లుందట అని నాకు తెలిసినంత వారకు సెప్పాను" అన్నది.

"సరే, యింక యింటికి పోదాం లే!" అన్నాను.

"యేం? కోప మొచ్చిందా?" అన్నది కుట్టి.

"కోపం రాలేదుగాని నే నొకటనుకుంటుంటే నువ్వొకటను కుంటున్నావు. మనిద్దరికీ కుదరదులే వెళ్దాంపా" అన్నాను.

"నే నన్న మాటలు నాయమా కాదా?" అని అడిగింది.

"నీ వన్నది నాయమే, నే ననుకుందీ నాయమే. మనిద్దరి నాయాలూ సరిపోడంలా!" అన్నాను.

"అదేం?"

"నాకు బార్యుంది. ఇద్దరు బిడ్డలున్నారు. నాకు పెండ్లి కాలేదని అనుకోడం పొరబాటు."

"ఏందో నా మొదటోడ్ని ఇడిసిపెట్టి మూడేళ్ళయింది. అప్పట్నుంసి మొగాళ్ళంటే బలే జాగొర్తగా వుంటుంటా, తప్పా?!" అన్నది కుట్టి.

'తప్పు నాదే' అని వత్తూ వత్తూ సెంపలేసుకున్నా.